సాక్షి మహబూబ్‌నగర్

శనివారం, 4, జనవరి, 2025



నిష్పక్షపాతంగా విధులు..
పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఐజీ సత్యనారాయణ అన్నారు.
వివరాలు 10లో ▸



ఆర్టీసీ సన్నద్ధం
సంక్రాంతి నేపథ్యంలో ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సన్నద్ధమవుతోంది.
వివరాలు 12లో ▸

గరిష్టం/కనిష్టం
33.8 /9.0

వాతావరణం
చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

7 నుంచి సదరం క్యాంపులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): **వికలత్వ** పరీక్షలు నిర్వహించే సదరం **క్యాంపులు ఈ** నెల 7వ తేదీ నుంచి ప్రభుత్వ **జనరల్ ఆస్పత్రి**లో నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ నర్సిములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 1 గంటలకు మీ సేవలో స్లాట్స్ బుక్ చేసుకోవాలని సూచించారు. శిబిరానికి హాజరయ్యే వారు ఫోన్ మెసేజ్ తేదీ, స్లాట్ రశీదు, మెడికల్ రిపోర్టు, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని కోరారు.

యువతకు ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీసీ టీవీ, కెమెరా ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని, ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం సౌకర్యం, యూనిఫాం, టూల్ కిట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం 95424 30607, 99633 69361 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

పాలమూరు: డిండి ఎత్తిపోతల పేరుతో పాలమూరు–రంగారెడ్డి పథకం నీరు తరలింపుపై ప్రతిపాదన ఉపసంహరణ, 14 నియోజకవర్గాలకు జలవనరుల కల్పన, కృష్ణానది నీటిలో తెలంగాణ రాష్ట్ర వాటా సాధనపై ఆదివారం జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ హరగోపాల్ హాజరవుతారని వెల్లడించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి మేధావులు, పౌరులు అధికంగా హాజరుకావాలని కోరారు.

ప్రమాదాలు తగ్గించడంలో డ్రైవర్లే కీలకం



పాలమూరు: ఎంతో మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే బస్సు డ్రైవర్ల విధులు చాలా కీలకమని, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాల్సి ఉంటుందని సీనియర్ ఎంవీఐ వాసుదేవ్‌రావు అన్నారు. జాతీయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్సు డిపోలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇతర డ్రైవర్లతో పోలిస్తే బస్సు డ్రైవర్ బాధ్యతగా, క్రమశిక్షణతో ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధానంగా ఓవర్ స్పీడ్, డ్రైవర్ అలసత్వం, ఏకాగ్రత లేకపోవడం, మద్యం తాగి వాహనం నడపటం, నిబంధనలు పాటించకపోవడమే ప్రధాన కారణమన్నారు. మహబూబ్‌నగర్ డిపో నుంచి రోజుకు 50 వేల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చుతుంటారని, ఇలాంటి పరిస్థితిలో డ్రైవర్ల బాధ్యత ఎంత కీలకం అనేది తెలుసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంఓ లక్ష్మీ ధర్మ, డిపో మేనేజర్ సుజాత, డ్రైవర్లు పాల్గొన్నారు.

చిక్కులు తొలగేనా..!



ఈ ఫొటోలోని రైతు పేరు కె.శివప్ప. హన్వాడ మండలం పెద్దదర్పల్లికి చెందిన ఇతను టంకర రెవెన్యూ గ్రామ శివారులో సర్వే నంబర్ 36లో అర ఎకరం భూమిని 14 ఏళ్ల క్రితం సాదా కాగితంపై కొనుగోలు చేశాడు. గత ప్రభుత్వం సాదాబైనామా కింద యాజమాన్య హక్కులు కల్పించేలా క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వడంతో 2020 జూన్‌లో మీసేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. పలు కారణాలతో సాదాబైనామాల క్రమబద్ధీకరణ ప్రక్రియ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం నూతన ప్రభుత్వం ధరణి స్థానంలో నూతనంగా భూభారతి పోర్టల్‌ను, ఆర్వోఆర్-24 చట్టం తీసుకొచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఆర్వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుకు అసెంబ్లీ ఆమోదం లభించిన నేపథ్యంలో తన సమస్య పరిష్కారమవుతుందని ఆ రైతు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

..ఇలా ఇతనొక్కడే కాదు.. సాదాబైనామా కింద యాజమాన్య హక్కుల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. అంతేకాదు.. ధరణి పోర్టల్‌లో లోపం, వివిధ కారణాలతో భూ యాజమాన్య హక్కులు పొందలేకపోయి..అధికారుల చుట్టూ ఏళ్ల తరబడి ప్రదక్షిణలు చేస్తున్న వారు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురానున్న భూభారతి పోర్టల్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.



'భూభారతి'పై ఎన్నో ఆశలు

- 'ధరణి' సమస్యలకు పరిష్కారం చూపేనా..
- పెండింగ్ దరఖాస్తులకు మోక్షం కలిగేనా..
- ఉమ్మడి జిల్లాలో 25,218 సాదాబైనామా అర్జీల పెండింగ్
- ఇతర సమస్యలపై సుమారు 9,263..
- మార్గదర్శకాలపై రైతుల్లో ఆసక్తి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: భూ వివరాలు పారదర్శకం, సమస్యల పరిష్కారానికి సులువైన మార్గమంటూ గత ప్రభుత్వం 2019లో ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. భూముల క్రయవిక్రయాలతో పాటు రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండేలా ఆ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు భూ సమస్యలు పరిష్కారమవుతాయని భావించిన రైతాంగానికి కొత్త చిక్కులు ఎదురయ్యాయి. చాలా గ్రామాల్లో భూ సమస్యలకు పరిష్కారం దొరక్క గొడవలు చెలరేగాయి. పలువురు కేసుల్లో ఇరుక్కుని నానా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. మండల తహసీల్దార్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లకు వస్తున్న ఫిర్యాదుల్లో భూసమస్యలు, వివాదాలపైనే ఎక్కువగా ఉండడం గమనార్హం.

జటిలంగా మారిన సమస్యలు..
డిజిటల్ పట్టాదారు పాస్‌పుస్తకంలో కాస్తు కాలం లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పలు కుటుంబాల మధ్య జగడాలు చోటుచేసుకున్నాయి. పట్టాదారుకు సర్వహక్కులు కల్పించడం.. ఎవరి ప్రమేయం లేకుండా భూముల క్రయవిక్రయాలకు ఆస్కారం కల్పించడంతో వివాదాలు తలెత్తి ఉమ్మడి కుటుంబాల్లో చిచ్చు రాజేశాయి. సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ నుంచి మొదలు జిల్లాస్థాయి అధికారులు, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం దక్కకపోవడంతో బాధిత రైతుల్లో నిరాశ నిస్పృహలు అలుముకున్నాయి. గ్రామాల్లో పెద్ద మనుషుల మధ్య తాత్కాలిక ఒప్పందాలు జరిగినా.. సమస్యలు మరింత జటిలంగా మారాయి.

ఈ ఫొటోలోని రైతు పేరు కె.జగన్‌నాయక్. హన్వాడ మండలం పల్లెమోనికాలనీ కొత్త చెర్వు తండాకు చెందిన ఆయనకు పెద్దదర్పల్లి రెవెన్యూ గ్రామ శివారులోని సర్వే నంబర్లు 2ఆ, 6ఈ, 7ఈ, 8ఈలో 0.25 ఎకరాల పట్టా భూమి ఉంది. ప్రభుత్వం లావుణి పట్టా కింద ఇచ్చిన భూమి సర్వే నంబర్ 78లో 1.11 ఎకరాల విస్తీర్ణంలో ఈ రైతు సాగు చేస్తున్నాడు. 2019లో భూరికార్డుల ప్యూరిఫికేషన్ అనంతరం ధరణి పట్టాదారు పాస్‌పుస్తకంలో కేవలం లావుణి పట్టా భూమి మాత్రమే నమోదైంది. ఈ మేరకు తన పాస్ బుక్‌లో పట్టా భూమిని కూడా ఎక్కించాలని అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం దక్కలేదు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకొస్తున్న ఆర్వోఆర్-2024 చట్టంతో తన సమస్య పరిష్కారమవుతుందని ఆశగా ఎదురుచూస్తున్నాడు.



మరో 9,263 అర్జీలు పెండింగ్..

ధరణిలో 33 రకాల మాడ్యూళ్లు ఉన్నాయి. పట్టాదారు పాస్‌పుస్తకంలో పేర్లు సరిచేయడం, మ్యుటేషన్, నాలా, మిస్సింగ్ సర్వే నంబర్ వంటి సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులకు అవకాశముంది. అయితే కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు రావడం, పరిష్కారం కేవలం కలెక్టర్ లాగిన్‌లో ఉండడంతో ఎనలేని జాప్యం చోటుచేసుకోవడం దరఖాస్తుదారులకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. అదేవిధంగా పీపీబీ (పట్టాదారు పాసుబుక్కు)లో డేటా కరెక్షన్ కోసం వందలాదిగా దరఖాస్తులు వచ్చినా.. చేసే వీలు ధరణి పోర్టల్‌లో లేకపోయింది. ఇలాంటి సమస్యలకు సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సుమారు 9,263 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురానున్న భూభారతి చట్టంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పరిశీలనకు వచ్చే అంశాలు..

భూభారతి పోర్టల్ విధివిధానాలు, మార్గదర్శకాలపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఈ పోర్టల్ అమల్లోకి వస్తే పలు అంశాలు పరిశీలకు వచ్చే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

- ■ పట్టాదారు పాస్ పుస్తకంలో దొర్లిన పొరపాట్లు, తప్పులు, ఇతరుల పేర్లు వచ్చినా, తప్పు వివరాలు నమోదైనా సవరించుకునే వెసులుబాటు.
- ■ రిజర్వేషన్ కేటగిరీ, ఆధార్ నంబర్ తప్పుగా నమోదైతే సరిచేసే అవకాశం.
- ■ భూమి స్వభావం, పట్టా, సీలింగ్, భూదాన్, దేవాదాయ, వక్ఫ్‌బోర్డు, అసైన్‌మెంటు, నిషేధిత జాబితాలో ఉంటే సరిదిద్దడం.
- ■ మాగాణి, మెట్ట, తరి వంటి వివరాలతో పాటు వాస్తవ విస్తీర్ణం కంటే పాస్‌పుస్తకంలో ఎక్కువ, తక్కువ నమోదైతే సరిదిద్దుకునే అవకాశం.
- ■ ఆర్వోఆర్ రికార్డులో కాస్తుదారు కాలం నమోదు.

ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే..

భూభారతి పోర్టల్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. చట్టంగా మారింది. నియమనిబంధనలు రూపొందించాల్సి ఉంది. ప్రభుత్వం దీనిపై కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ విధివిధానాల ఆధారంగా సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించే అవకాశం ఉంది. ధరణి పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇది రెగ్యులర్ ప్రక్రియనే.

– మోహన్‌రావు,
అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

సాదాబైనామా దరఖాస్తులు 25,218..

సాదా కాగితాలపై భూములు కొనుగోలు చేసి కాస్తులో ఉంటూ పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఉపశమనం కలిగించేందుకు గత ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. సాదాబైనామాల క్రమబద్ధీకరణకు 2020 జూన్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఈ మేరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోని ఐదు జిల్లాల్లో 25,218 దరఖాస్తులు వచ్చాయి. కాస్తులో ఉన్నప్పటికీ భూమి అమ్మిన వారి సమ్మతి తీసుకోవాలనే నిబంధన, అమ్మిన వారి పేరున భూమి లేకపోవడం వంటి సమస్యలతో పాటు కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో వాటి క్రమబద్ధీకరణకు అడుగులు ముందుకుపడలేదు. తాజాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి ఇబ్బందులు, సాదాబైనామాల క్రమబద్ధీకరణలో న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా భూభారతి పోర్టల్, ఆర్వోఆర్–2024 చట్టం తీసుకొచ్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. నూతన ఆర్వోఆర్ చట్టం అసెంబ్లీలో ఆమోదం పొందిన నేపథ్యంలో సాదాబైనామా దరఖాస్తుదారుల్లో ఆశలు రేకెత్తాయి.

జిల్లాల వారీగా పెండింగ్ సమస్యలు ఇలా..

జిల్లా	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	నారాయణపేట	జోగుళాంబ గద్వాల	వనపర్తి
సాదాబైనామా దరఖాస్తులు	4,217	8,187	2,102	6,412	4,300
ఇతరత్రా దరఖాస్తులు	2,000	3,544	1,113	1,236	1,370

అనుమతి లేని క్లినిక్‌లను తనిఖీ చేయండి

- మాస్ మీడియా అధికారిని ఆదేశించిన డీఎంహెచ్‌ఓ
- 'సాక్షి' కథనానికి స్పందించిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి



'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..

పాలమూరు: కనీసం అర్హత లేకుండా ఇష్టానుసారంగా వైద్యం నిర్వహిస్తున్న వైనాన్ని వివరిస్తూ 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం 'వచ్చీరాని వైద్యం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనం జిల్లా వైద్యారోగ్యశాఖలో కలకలం రేపింది. ప్రధానంగా జిల్లాలో అనుమతి లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు తదుపరి ఏం జరుగుతుందో అనే ఆందోళనలో ఉన్నారు. ఈ వ్యవహారంపై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ స్పందిస్తూ ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై వివరాలు సేకరించాలని మాస్ మీడియా అధికారిణి మంజులను ఆదేశించారు. శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఫిర్యాదులు ఉన్న వాటితో పాటు అనుమతి లేని వాటిపై దృష్టి సారించి, తనిఖీలు చేయాలని ఆదేశించారు.

పిల్లల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి

పాలమూరు: చిన్న పిల్లల హక్కుల కోసం ఉద్దేశించిన చట్టాల అమలులో భాగంగా పిల్లల రక్షణ, సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని సమావేశ మందిరంలో శుక్రవారం బాలల హక్కులు, చట్టాల అమలు రక్షణ, సంరక్షణ వంటి అంశాలపై చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ సభ్యులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. బాలల హక్కుల పరిరక్షణలో ఎలాంటి లోపాలు లేకుండా కృషి చేయాలన్నారు. రెండు రోజుల పాటు ఇచ్చే శిక్షణలో బాలల హక్కులు, చట్టాలు, రక్షణ, సంరక్షణ వంటి అంశాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. స్నేహ పూర్వకమైన బాలల న్యాయ సేవల పథకం–2024లో భాగంగా సీనియర్ సివిల్ జడ్జి ఇందిర పర్యవేక్షణలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో, లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులతో కలిపి చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం బాలల రక్షణపై ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. న్యాయమూర్తులు శారదాదేవి, ఇందిర, న్యాయవాదులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు బి.పాపిరెడ్డి, శారదాదేవి, ఇందిర, తదితరులు

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు


మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక క్రీడల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

దేవరకద్ర: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. శుక్రవారం దేవరకద్ర మార్కెట్‌యార్డు పాలక మండలి చైర్మన్ కథలప్ప, వైస్ చైర్మన్ హన్మంతరెడ్డి, డైరెక్టర్లు, వీరప్పయ్యస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ బీసు నర్సింహారెడ్డిల ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 64 ఏళ్ల సమైక్య రాష్ట్రంలో 16 మంది ముఖ్యమంత్రులు రూ.64వేల కోట్లు అప్పులు చేశారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత పదేళ్లలో రూ.8 లక్షల కోట్లకు అప్పులను పెంచారని విమర్శించారు. కేవలం రూ.4 లక్షల కోట్లే అప్పులు చేసినట్లు హరీశ్‌రావు, కేటీఆర్ ప్రజలు మభ్యపెట్టడానికి మాట్లాడుతున్న దాంట్లో నిజం లేదన్నారు. వాళ్లు చేసిన అప్పులకు ప్రతి నెలా ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ చెల్లిస్తుందని తెలిపారు. ఏడాది పాలనలోనే ఒక పక్క సర్దుబాట్లు చేసుకుంటూ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ఆరు గ్యారంటీలను అమలు చేసినట్లు చెప్పారు. రైతులకిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి రూ.21వేల కోట్లతో రుణమాఫీని చేసినట్లు పేర్కొన్నారు. పేదలకు ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి రూ.175 కోట్లతో 3,500 ఇళ్లను మంజూరు చేసిందని, త్వరలో కేటాయింపులు జరుగుతాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డిని రెండేళ్లలో పూర్తి చేసి 12 లక్షల ఎకరాలకు సాగునీరిస్తానని చెప్పి మాట తప్పారని విమర్శించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రం అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. త్వరలో వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తామని, కోర్టును ప్రారంభిస్తామని చెప్పారు. ప్రజలు రైల్వే గేటుకు అటు ఇటు తిరగడానికి సబ్‌వేను మంజూరు చేశారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవడానికి అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ప్రశాంత్, గోవర్ధన్‌రెడ్డి, భారతమ్మ, నాగిరెడ్డి, శెట్టి శేఖర్, సురేందర్‌రెడ్డి, ఫారూఖ్, బాలస్వామి, కోనరాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షీటీమ్స్‌తో మహిళలకు భద్రత: ఎస్పీ



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో షీటీమ్స్‌తో మహిళలకు, బాలికలకు భద్రత భరోసా కలుగుతుందని, విద్యాసంస్థల దగ్గర, రద్దీ ఏరియాల్లో నిరంతరం షీటీం బృందాల నిఘా కొనసాగుతుందని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మాయిలు, విద్యార్థినిలు వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100, లేదా జిల్లా షీటీం నంబర్ 87126 59365 ఫిర్యాదు చేస్తే సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిసెంబర్‌లో నాలుగు ఫిర్యాదులు వచ్చాయని, ముగ్గురికి కౌన్సెలింగ్ ఇచ్చామని, ఇద్దరిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. సిబ్బంది గత నెల రోజుల్లో 65 హాట్ స్పాట్ ఏరియాలను తనిఖీలు చేశారని పేర్కొన్నారు. షీటీం బృందాలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో, కేజీబీలు, రెసిడెన్షియల్ స్కూలలో విద్యార్థులకు ర్యాగింగ్, వేధింపులు, పోక్సో, షీటీం పనితీరు, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ వంటి అంశాలపై అవగాహన కలిపిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఉన్న మహిళలు, విద్యార్థులు షీటీం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు

జిల్లా పరిధిలో ప్రభుత్వం నిషేధిత చైనా మాంజాను విక్రయాలు చేసినా, వినియోగించినా చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకి హెచ్చరించారు. జిల్లాలో చైనా మాంజా విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని, చైనా మాంజాతో వచ్చే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నైలాన్, సింథటిక్ ధారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని తెలిపారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో చైనా మాంజా పూర్తిగా నిషేధించారని, జిల్లాలో ఎక్కడైనా, మార్కెట్‌లలో, దుకాణాల్లో చైనా మాంజా విక్రయించినట్లు తెలిస్తే పోలీస్‌స్టేషన్లు లేదా డయల్ 100 లేదా 87126 59360 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, చిత్రంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

- జిల్లా గౌరవాన్ని నిలబెట్టేలా ఉండాలి
- జడ్చర్లలో 7, 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన
- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించేందుకు అవకాశం లభించిందని, జిల్లా గౌరవాన్ని నిలబెట్టేలా ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇన్‌స్పైర్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన కమిటీల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జడ్చర్లలోని పోలేపల్లి సెజ్‌లో ఉన్న ఎస్‌బీకేఎం ఇంటర్నేషనల్ పాఠశాలలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనకు 33 జిల్లాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వస్తారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వసతి, రవాణా, పార్కింగ్ వంటి ప్రధానమైన విషయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో కార్యక్రమాన్ని సమీక్షిస్తూ ఓ ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పర్యవేక్షిస్తారని, ఈ కార్యక్రమం నిర్వహణకు 25 కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీలలో వివిధ శాఖల అధికారులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని కలెక్టర్ వివరించారు. 33 జిల్లాల నుంచి 2,500 మంది విద్యార్థులు, గైడ్ టీచర్లు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా పేరును గుర్తించుకునేలా వసతి ఏర్పాట్లు ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాల కోసం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్

- 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదనలు సిద్ధం
- డీసీసీబీ ఆడిటోరియంలో డీఎల్‌టీసీ సమావేశం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)లో పంట రుణాల కోసం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను డీసీసీబీ పాలకవర్గం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. శుక్రవారం స్థానిక డీసీసీబీ ఆడిటోరియంలో జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్, డీసీసీబీ సీఈఓ డి.పురుషోత్తంరావు పంటల వారీగా ప్రస్తుత ఏడాది (2024–25) కి సంబంధించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను పరిగణలోకి తీసుకున్నారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో చర్చించి ఏయే పంటలకు ఎన్ని రుణాలు ఇవ్వాలనే దానిపై క్షుణ్ణంగా చర్చించారు. అనంతరం డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ తీసుకున్న నిర్ణయాలను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీకి పంపిస్తామన్నారు. అక్కడి నుంచి ఆమోదం లభించిన వెంటనే ఆయా బ్రాంచీ అధికారులకు పూర్తి సమాచారం తెలియజేస్తామన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎంలు మనోహర్‌రెడ్డి, షణ్ముఖచారి, డీఏఓ వెంకటేష్‌తో పాటు బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

కందులు క్వింటాల్ రూ.7,551

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్ యార్డులో శుక్రవారం కందులు క్వింటాల్ గరిష్టంగా రూ.7,551, కనిష్టంగా రూ.5,000 ధరలు లభించాయి. వేరుశనగ గరిష్టంగా రూ.6,795, కనిష్టంగా రూ.5,047, పెబ్బర్లు రూ.7,602, మొక్కజొన్న రూ.2,462, ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ గరిష్టంగా రూ.2,631, కనిష్టంగా రూ.1,836, పెసర్లు రూ.5,500, ఉలువలు రూ.7,409 ధరలు పలికాయి. దేవరకద్ర మార్కెట్‌లో కందులు గరిష్టంగా రూ.7,605, కనిష్టంగా రూ.6,429గా ధరలు లభించాయి.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: పురుగు మందు తాగి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని పోస్టాఫీస్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(50) శుక్రవారం తెల్లవారుజామున పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడించారు. మృతుడు కర్ణాటకకు చెందిన వ్యక్తి మాదిరిగా ఉన్నాడని, అతని దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో శరీర భాగాలు ఛిద్రం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని స్వామి వివేకనంద కళాశాల సమీపంలో జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి(40)ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం వేగంగా ఉండటం వల్ల శరీర భాగాలు పూర్తిగా గుర్తించలేని విధంగా మారిందని ఆయన పేర్కొన్నారు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని, భిక్షాటన చేస్తూ జీవనం సాగించే వ్యక్తి మాదిరిగా ఉన్నాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

పొలంలోనే వ్యవసాయ కూలీ మృతి


హన్మంతు(ఫైల్)

ఖిల్లాఘనపురం: పొలంలో ఎరువులు చల్లుతూ వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మ్యాతరి హన్మంతు (45) గ్రామంలోని గుద్దేటి చెన్నయ్య వ్యవసాయ పొలంలో వరి నాటు వేసే సమయంలో ఎరువులు చల్లేందుకు కూలీకి వెళ్లాడు. మధ్యాహ్న భోజనం తర్వాత యథావిధిగా ఎరువులు చల్లుతూ ఒక్కసారిగా కరిగెట్లో పడిపోయాడు. తోటి కూలీలు, రైతు గుర్తించి బయటకు తీసి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

దొంగకు దేహశుద్ధి



ఆత్మకూర్: గుడి గంటలు చోరీ చేసి ఎత్తుకెళ్తున్న దొంగను స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసిన సంఘటన శుక్రవారం ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. స్థానిక రామకృష్ణకాలనీలో ఓ వ్యక్తి గుడిగంటలు అనుమానాస్పదంగా తీసుకుని వెళ్తుండగా గమనించిన యువకులు అతడిని పట్టుకుని ప్రశ్నించగా చోరీ చేసినట్లు బదులిచ్చాడు. దీంతో యువకులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామని స్థానిక ఆంజనేయస్వామి ఆలయంతోపాటు చిన్నచింతకుంటలోని ఓ గుడిలో గంటలు చోరీ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై చిన్నచింతకుంట పోలీసులకు సైతం సమాచారం ఇచ్చామని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

వ్యక్తికి రిమాండ్

నారాయణపేట: జిల్లాకేంద్రంలో ఐదేళ్ల చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తించి లైంగిక దాడికి పాల్పడిన నరేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని డీఎస్పీ లింగయ్య శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు.

మహిళ అదృశ్యం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అంజనగిరికి చెందిన మహిళ సునీత అదృశ్యమైన ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల30న సరుకులు తీసుకొచ్చేందుకు కుమారుడు హర్షిత్ వెంటబెట్టుకొని కొల్లాపూర్‌కు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మహిళ భర్త శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ బాలిక అదృశ్యం

లింగాల: మండల కేంద్రానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యమైన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బాలిక గురువారం పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదు. తల్లిదండ్రులు వెతికినా ఆచూకీ తెలువలేదు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ నాగరాజ్ తెలిపారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి


ప్రతిభకనబర్చిన సిబ్బందిని సన్మానిస్తున్న ఐజీ సత్యనారాయణ, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

- మల్టీజోన్– 2 ఐజీ సత్యనారాయణ
- పదో పటాలంలో ఘనంగా దీక్షాంత్ పరేడ్

ఎర్రవల్లి: పోలీస్ శాఖలో విధులు నిర్వహించే ప్రతి అధికారి కూడా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొంది పోలీస్ శాఖ గౌరవాన్ని పెంచాలని మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పదో పటాలంలో టీజీఎస్‌పీ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎన్నికైన నిజామాబాద్, ములుగు, హైదరాబాద్ జిల్లాలకు చెందిన 522 మంది కానిస్టేబుళ్లు 9 నెలల శిక్షణ పూర్తిచేసుకున్న సందర్భంగా కమాండెంట్ సాంబయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఐజీ హాజరయ్యారు. ముందుగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు క్రమశిక్షణతో చేసిన ప్రతిజ్ఞ, నిషాన్ తోలి, మార్చ్ ఫాస్ట్, కర్రసాము, కరాటే, డ్రిల్ కార్యక్రమాలను తిలకించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా శిక్షణ పూర్తిచేసుకొని సమాజ సేవ కోసం పోలీస్ శాఖలో చేరుతున్న అభ్యర్థులందరికీ స్వాగతం పలికారు. సమాజంలో అన్ని ఉద్యోగాలతో పోలిస్తే పోలీస్ ఉద్యోగానికి ప్రత్యేక గౌరవం ఉందన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణలో కుల, మత, వర్గాలకు అతీతంగా విధులు నిర్వహించాలని సూచించారు. సమాజంలో ఎలాంటి అండ లేని పేదల రక్షణ, అభ్యున్నతి కోసం పాటుపడాలని చెప్పారు.


పదో పటాలం పరేడ్ గ్రౌండ్‌లో డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

శాంతిభద్రతలను కాపాడాలి..

ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎక్కడైతే శాంతిభద్రతలు, నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉంటుందో అక్కడ ప్రజలు సుఖ శాంతులతో జీవిస్తారన్నారు. శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఉగ్రవాదం, తీవ్రవాదం, నక్సలిజం, సైబర్ నేరాలతో అధికంగా సతమతమవుతున్న దేశ ప్రజలను రక్షించేందుకు పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడటం గర్వకారణమన్నారు. కమాండెంట్ సాంబయ్య మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా కఠోర శ్రమ, కఠినమైన శిక్షణను సమయపాలనతో పూర్తి చేసుకొని సమాజంలోకి అడుగుపెడుతున్న అభ్యర్థులంతా క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి.. ప్రజల ఆదరాభిమానాలు పొందాలని కోరారు. అనంతరం శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఐజీ, ఎస్పీ, కమాండెంట్లు జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కృష్ణ, పటాలం అసిస్టెంట్ కమాండెంట్లు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, పాణి, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తర్వాతే నోటిఫికేషన్ ద్వారా రెగ్యులర్ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని పీయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ఈ మేరకు పీయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం కాంట్రాక్టు వ్యవస్థనే లేకుండా చేస్తామని, అన్ని డిపార్ట్‌మెంట్లలో సిబ్బందిని రెగ్యులర్ చేసి యూనివర్సిటీల్లో పనిచేస్తున్న అధ్యాపకులను విస్మరించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. యూనివర్సిటీల్లో కాంట్రాక్టు సిబ్బంది అన్ని స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్నారని, కానీ, వేతనాల పెంపు, పే స్కేల్, ఉద్యోగ భద్రత వంటివి లేకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ స్థాయిలో బోధిస్తున్న తమకు ప్రైమరీ స్కూల్ టీచర్ కంటే తక్కువ వేతనాలు ఇస్తున్నారని, ఇది పూర్తిగా శ్రమదోపిడే అని, వెంటనే ప్రభుత్వం తమకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పర్వతాలు, సుదర్శన్‌రెడ్డి, సోమేశ్వర్, చంద్రశేఖర్, గౌస్‌మోయినుద్దీన్, మాధురిమోహన్, ఆయేషా హష్మీ, రామ్మోహన్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు రవికుమార్

ముగిసిన పీయూ ఈసీ సమావేశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ(పీయూ) ఎగ్జిక్యూటివ్ కమిటీ(ఈసీ) సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఇందులో న్యాక్ కమిటీ పీయూను సందర్శించనున్న నేపథ్యంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అనుతులు, నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాల పెంపు తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తుంది. వీసీ శ్రీనివాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా శనివారం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

ఆర్టీసీ బస్సులో ప్రసవం



కేటీదొడ్డి: ఆర్టీసీ బస్సులో ఓ మహిళ ప్రసవించిన ఘటన గద్వాల జిల్లా నందిన్నె గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామానికి చెందిన పావని అనే మహిళకు రాయిచూర్ జిల్లా బాయిదొడ్డికి చెందిన నరేష్‌తో వివాహమైంది. ప్రస్తుతం పావని నిండు గర్భిణీ. ఆరోగ్య పరీక్షల కోసం శుక్రవారం గద్వాల ప్రభుత్వాస్పత్రికి గద్వాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో వస్తుంది. నందిన్నె గ్రామం వద్దకు రాగానే పురిటినొప్పులు మొదలయ్యాయి. విషయాన్ని తోటి ప్రయాణికులకు తెలిపింది. వెంటనే డ్రైవర్ బస్సును రోడ్డుపక్కన నిలిపారు. పురిటినొప్పులు అధికం కావడంతో బస్సులోనే మహిళలందరూ కలిసి ఆమెకు పురుడుపోశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సమాచారం అందుకున్న 108 వాహనం అక్కడికి చేరుకుని మహిళను, పాపను గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు ఆర్టీసీ డ్రైవర్ జీఎస్ గౌడ్, కండెక్టర్ కిషోర్‌ను ప్రయాణికులు అభినందించారు.

అంతా గుట్టుగా..!

- ఎలాంటి ప్రకటన లేకుండా టెక్నికల్ పోస్టుల భర్తీకి కసరత్తు
- అర్హత లేని వారు రావడంతో విషయం వెలుగులోకి..

గద్వాల క్రైం: జిల్లా కేంద్రం సమీపంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో టెక్నికల్ పోస్టులను ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా గుట్టుగా భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రెండు నెలల క్రితం దౌదర్‌పల్లి సమీపంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించారు. ఈమేరకు అధ్యాపకులు, ప్రొఫెసర్ల నియామకం పూర్తి కాగా.. బోధనా తరగతులు సైతం ఈ అకాడమిక్ ఇయర్‌లో కొనసాగుతున్నాయి. అయితే మెడికల్ కళాశాలలోని వివిధ విభాగాలలో 32 టెక్నికల్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక, మెడికల్ కళాశాల ఏఓ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 16 టెక్నికల్ పోస్టుల ఎంపికకు కొందరు అభ్యర్థుల అర్హత ధృవపత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. వాస్తవంగా కళాశాలలోని ఖాళీ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ లేదా అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. అప్పుడు నిరుద్యోగ యువత ఆయా విభాగాల్లోని టెక్నికల్ పోస్టులకు దరఖాస్తు చేస్తారు. ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన అనంతరం అర్హులను అధికారులు ఎంపిక చేస్తారు.. ఇదీ సాధారణంగా ఏ శాఖలో అయినా జరిగే నియామక తంతు. కానీ, జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని టెక్నికల్ పోస్టులను ఎలాంటి అధికార ప్రకటనలు లేకుండానే 16 పోస్టుల భర్తీకి అధికారులు 16 మంది వ్యక్తుల అర్హత ధృవపత్రాల పరిశీలన చేయడం గమనార్హం. దీని వెనుక దాగి ఉన్న రహస్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అయితే ఎంపికకు అర్హత లేని ఓ మైనర్, ఇద్దరు వ్యక్తులు అక్కడకు రావడంతో పలువురు అభ్యంతరం వ్యక్తం చేయగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

16 మంది ధ్రువపత్రాల పరిశీలన

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రస్తుతం టీవీవీ(తెలంగాణ వైద్యా విధాన్ పరిషత్) కింద కొందరు టెక్నికల్ విభాగంలో పని చేస్తున్నారు. అయితే సీనియార్టీ ఉన్న వారిని మెడికల్ కళాశాలకు ఎంపిక చేయాలని, ప్రస్తుతం వారికి జీతాలు వైద్యా విధాన్ పరిషత్ నుంచి రావడం లేదని, టెక్నికల్ పోస్టులకు అవకాశం కల్పించాల్సిందిగా కొందరు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారని సమాచారం. వారు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే 16 మంది అర్హత కలిగిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారని సమాచారం. ఇంత వరకు బాగానే ఉన్నా ఎలాంటి పని అనుభవం లేని ముగ్గురు వ్యక్తులు ధ్రువపత్రాల పరిశీలనకు రావడం ఏంటనే ప్రశ్నలు పలువురు లేవనెత్తుతున్నారు. ఎక్కడైనా పోస్టుల భర్తీకి ముందుగా అధికార ప్రకటన చేయాల్సి ఉంది. కానీ, ఇక్కడ మాత్రం ఎలాంటి ప్రకటన లేకుండా గుట్టుగా నియామక ప్రక్రియ చేపట్టడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అన్ని అర్హతలు ఉన్న ఎందరో నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు లేక ప్రైవేట్ ఆస్పత్రుల్లో చాలీచాలని జీతాలకు పని చేస్తున్నారని, అలాంటి వారెందరికో ఇలా గుట్టుగా నియామక ప్రక్రియ చేపట్టడంతో అన్యాయం జరుగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న టెక్నికల్ పోస్టులకు బహిరంగ ప్రకటన విడుదల చేసి.. అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని పలువురు కోరుతున్నారు.


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టర్ ఆదేశాల మేరకే..

మెడికల్ కళాశాలలో రేడియో, ఈసీజీ, ఎక్స్‌రే, ల్యాబ్ తదితర టెక్నికల్ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వాసుపత్రిలో వివిధ విభాగాల్లో అనుభవం కలిగిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా అధికారులు సిఫార్సు చేసిన అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చారు. అయితే ధ్రువపత్రాల పరిశీలనలో ముగ్గురు వ్యక్తులు ఇక్కడ పని చేయని వారు అని గుర్తించాం. ఇదేమి రహస్యంగా చేయడంలేదు. పరిశీలన నివేదిక కలెక్టర్‌కుఅందజేస్తాం. – ప్రియాంక, జిల్లా ఉపాధి కల్పన అధికారి

గొర్రెల మందపై చిరుత దాడి

కొత్తపల్లి: గొర్రెల మందపై చిరుత దాడి చేసిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని కొత్తపల్లితండాలో మాజీ సర్పంచ్ బెణిక్యా నాయక్ పొలంలో గురువారం రాత్రి నిడ్జింత గ్రామానికి చెందిన గోవిందప్ప, నీలప్పలు తమ గొర్రెల మంద ఆపగా అక్కడే మాటు వేసి ఉన్న చిరుత ఒక్కసారిగా దాడి చేసి రెండు గొర్రెలను చంపేసింది. గమనించిన కాపరులు కేకలు వేయగా పారిపోయింది. ఈ విషయమై అటవీ శాఖ అధికారి లక్ష్మణ్‌ను వివరణ కోరగా నందిపాడు, దోరెపల్లి, గుండుమాల్ పరిసర ప్రాంతాల్లో చిరుతలు సంచరిస్తున్నాయని, రైతులు, కాపరులు రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే అడవి జంతువుల దాడిలో పశువులు, మేకలు, గొర్రెలు మృతిచెందితే తమకు చెప్పాలని, ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించేందుకు కృషిచేస్తామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొత్తకోట రూరల్: కనిమెట్టలో గురువారం రాత్రి తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎర్రన్న గొర్రెల మేపునకు భార్యతో కలిసి వారం కిందట ఇతర ప్రాంతాలకు వెళ్లారు. కుమార్తె మౌనిక గ్రామంలో ఉండే పెద్దమ్మ ఇంట్లో ఉంటోంది. గురువారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోనికి చొరబడి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం పక్కింటి వారు చూసి మౌనికకు ఫోన్ చేసి చెప్పడంతో ఇంటికి చేరుకొని దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. బీరువాలో దాచిన అరతులం బంగారు మ్యాట్టీలు, 19 తులాల వెండి సామాగ్రి చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కేసు నమోదు

గద్వాల క్రైం: పూడూరు ఎర్రవల్లికి చెందిన కుర్వ వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడి వద్ద రూ.24 లక్షల విలువైన స్టాక్‌మార్కెట్ షేర్లు కొనుగోలు చేసిన కొండపల్లికి చెందిన నర్సింహులు, మరికొందరు తమకు న్యాయం చేయాలంటూ గురువారం ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. దీంతో శుక్రవారం సాయంత్రం కుర్వ వెంకటేష్ భార్య సుమిత్ర, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- దువాసిపల్లిలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత
- కేటీదొడ్డిలోని ఓ రైస్‌మిల్లుపైనా ఆకస్మిక దాడి
- తనిఖీల వ్యవహారాన్ని గుట్టుగా ఉంచిన అధికారులు

గద్వాల/ ఎర్రవల్లి: జిల్లావ్యాప్తంగా పలు రైస్‌మిల్లుల్లో రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెండు రోజులుగా గుట్టుగా తనిఖీలు నిర్వహించారు. పీడీఎస్ బియ్యం అక్రమాలకు పేరుగాంచిన గద్వాల జిల్లాలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతో బియ్యం దొంగలు హడలెత్తిపోయినట్లు తెలిసింది. ఎర్రవల్లి, కేటీదొడ్డి, అయిజ మండలాలతోపాటు గద్వాల పట్టణంలో రహస్యంగా పర్యటించి.. అనుమానాస్పద రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఎర్రవల్లి మండలం దువాసిపల్లి వద్ద ఉన్న ఓ రైస్‌మిల్లుకు సమీపంలో 153 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. బియ్యాన్ని సీజ్ చేసి కోదండాపురం పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు అప్పగించి కేసు నమోదు చేశారు. అలాగే కేటీదొడ్డి మండలం నందిన్నెలోని ఓ రైస్‌మిల్లులో రైతు వద్ద తీసుకున్న ధాన్యానికి సంబంధించి లెక్కల్లో తేడాలు ఉండటం గమనించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సదరు మిల్లు యజమానికి నోటీసులు జారీచేసినట్లు తెలిసింది.

గుట్టుగా పర్యటన..

రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురు, శుక్రవారాల్లో జిల్లాలో గుట్టుగా పర్యటించారు. జిల్లావ్యాప్తంగా 64 రైస్ మిల్లులు ఉండగా పలు మిల్లులపై అవినీతి ఆరోపణలకు సంబంధించి రాష్ట్ర విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం. ఈ మేరకు వారు రహస్యంగా ఫిర్యాదులు వచ్చిన మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి వెళ్లినట్లు తెలిసింది. అయితే ఈ తనిఖీల గురించి బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సివిల్ సప్లయ్ శాఖ జిల్లా అధికారులను వివరణ కోరగా స్పందించకపోవడం గమనార్హం. అయితే దువాసిపల్లి సమీపంలో పట్టుకున్న లారీలో రూ.7 లక్షల విలువైన 153 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయని, ఈ విషయమై సివిల్ సప్లయ్ అధికారి మహర్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కోదండాపురం ఎస్‌ఐ స్వాతి తెలిపారు.



పోలీసులు అదుపులోకి తీసుకున్న బియ్యం లారీ

వెట్టిచాకిరీ నుంచి విముక్తి

అచ్చంపేట రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మరో గ్రామానికి చెందిన చెంచు కుటుంబానికి రూ.15 వేలు అప్పుగా ఇచ్చి తన వ్యవసాయ పొలంలో పనిలో పెట్టుకున్నాడు. మూడేళ్లగా వెట్టిచాకిరీ చేయించుకుంటూ ఇబ్బందులకు గురిచేశాడు. ఈ విషయంపై గతేడాది నవంబర్‌లో ఆదివాసి సంఘీభావ సంఘం పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని చెంచు దంపతులకు నవంబర్ 14న వెట్టిచారికీ నుంచి విముక్తి కల్పించారు. శుక్రవారం అచ్చంపేట సివిల్‌కోర్టు వద్ద జిల్లా జడ్జి రాజేష్ బాబు, జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి సబితా, అచ్చంపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి విజయ్‌కుమార్, ఆర్డీఓ మాధవి, డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, ఎస్‌ఐ రమేష్ చెంచు బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం ఆర్డీఓ మాధవి చెంచు దంపతులకు ఒక్కొక్కరికి రూ. 30 వేల చొప్పున డీడీలు అందజేశారు.

యువతి బలవన్మరణం

- తన గురించి చెడుగా మాట్లాకుంటున్నారని మనస్తాపం
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

అచ్చంపేట రూరల్/ఉప్పునుంతల: సామాజిక మాధ్యమాల్లో తన గురించి చెడుగా పోస్టులు చేస్తున్నారని మనస్తాపం చెందిన ఓ యువతి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి అచ్చంపేట ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం.. ఉప్పునుంతల మండలం పూర్యానాయక్‌తండాకు చెందిన ఓ యువతి గతేడాది డిసెంబర్ 28న అచ్చంపేట శివారులో పురుగు మందు తాగింది. గమనించిన తల్లిదండ్రులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ ఈ నెల 1న మృతిచెందింది. ఈ ఘటనపై ఈ నెల 2న రాత్రి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అచ్చంపేట ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ప్రేమ వ్యవహారమే కారణమా..?

కాగా అదే తండాకు చెందిన ఓ యువకుడు గతేడాది డిసెంబర్ 21న పురుగు మందు తాగి మృతిచెందాడు. అయితే యువతీ, యువకులు ప్రేమ వివాహాన్ని పెద్దలు అంగీకరించకపోవడంతోనే యువకుడు మరణించినట్లు తెలిసింది. యువతి వల్లే తమ కుమారుడు చనిపోయాడని తండాలో అనడంతో.. యువతి కుటుంబ సభ్యులు అచ్చంపేట శివారు ప్రాంతంలో ఉన్న కోళ్ల ఫాం వద్ద కూలీ పనులు చేయడానికి వచ్చారు. అయినప్పటికీ యువతి గురించి చెడుగా మాట్లాడుకుంటున్నారని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు రావడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటనతో తండాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

దాడి చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: తమపై దాడి చేసిన వారిపై కాంగ్రెస్ పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజా అజ్మత్ అలీ, పార్టీ మైనార్టీ విభాగం అసెంబ్లీ కోఆర్డినేటర్ షాఫైసల్ శుక్రవారం దేవరకద్రలో డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా అంబేద్కర్ చౌరస్తా సమీపంలో ఫ్లెక్సీ కట్టామని, తమ ఫ్లెక్సీని తీసివేసి ఇతర ఫ్లెక్సీ కట్టగా ఎందుకు కట్టారని అడిగితే తమపై పార్టీకి సంబంధించిన ఇద్దరు మాజీ కౌన్సిలర్లు, మరో నాయకుడు దాడి చేశారని తెలిపారు. పదేళ్ల నుంచి ఎన్నో కష్టాలు అనుభవించి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశామని, కానీ కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు తమపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే వారిపై పార్టీ పరంగా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి అందజేసిన వారిలో నాయకులు అవేజ్ అహ్మద్, ఫహిం, సంజీవ్ తదితరులు ఉన్నారు.


డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గిరిజన ఉపకారానికి మోక్షం

రూ.80 కోట్లు విడుదలకు సీఎం గ్రీన్‌సిగ్నల్

సాక్షి, హైదరాబాద్: గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు ఊరట లభించింది. 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ కోర్సులు చదివిన ఎస్టీ విద్యార్థుల ఖాతాల్లో అతి త్వరలో నిధులు జమ కానున్నాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం వాటాను విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విడుదల చేయలేదు. ఈ అంశంపై 'రాష్ట్ర వాటా విడుదల ఎప్పుడో..!'శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల (75శాతం)కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ (25శాతం)ను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద రూ.80 కోట్ల విడుదలకు చర్యలు చేపట్టారు. ఈ నిధులు విడుదల కావడంతో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు పూర్తికానున్నాయి. అలాగే ఎస్సీ విద్యార్థుల ఫీజు బకాయిలను కూడా వెనువెంటనే విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

సాక్షి ఎఫెక్ట్

'క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్'లో

వీఐటీకి 8వ ర్యాంకు

సాక్షి, హైదరాబాద్: క్యూఎస్ 'వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్: సస్టెయినబిలిటీ–2025' 3వ ఎడిషన్‌లో వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) ప్రపంచవ్యాప్తంగా 1,744 విద్యాసంస్థల్లో 396వ ర్యాంకు సాధించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన 78 విద్యాసంస్థలు స్థానం సంపాదించగా అందులో వీఐటీ 8వ ర్యాంకు పొందినట్లు వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 53 స్థానాలు మెరుగుపరుచుకున్నట్లు పేర్కొంది. భారత్‌లో ఈ ర్యాంకింగ్స్‌లో ఐఐటీ ఢిల్లీ టాప్ ర్యాంకును సాధించింది.

'సుప్రీం' కేసులో ఇంత నిర్లక్ష్యమా..?

'మార్గదర్శి'పై మరెన్నాళ్లు?

సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి: మార్గదర్శి ఫైనాన్షియర్స్ భారీ ఆర్థిక అవకతవకలపై కౌంటర్లు దాఖలు చేయాలన్న తమ ఆదేశాలను పట్టించుకోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇంకా ఎన్నాళ్లకు కౌంటర్ దాఖలు చేస్తారని ఇరు ప్రభుత్వాలను నిలదీసింది. స్వయంగా సుప్రీం కోర్టు విచారణకు పంపిన కేసులో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత మాత్రం సహించరానిదంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. గత జూన్‌లో విచారణ ప్రారంభించి ఇప్పటి వరకు 13 సార్లు వాయిదాలు వేశామని గుర్తు చేసింది. కౌంటర్లు దాఖలు చేస్తామని గత విచారణ సమయంలోనే చెప్పారని, అయినప్పటికీ కౌంటర్ దాఖలు చేయపోవడానికి కారణాలేంటో చెప్పాలని నిలదీసింది. మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఇరు రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఇదే చివరి అవకాశమని తేల్చి చెప్పింది. లేని పక్షంలో తదుపరి విచారణకు తమ ముందు హాజరు కావాలని ఇరు రాష్ట్రాల సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. అదనపు కౌంటర్ దాఖలు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కి మూడు వారాల గడువునిచ్చింది. అంతేకాక రిప్లై కాపీని మాజీ ఎంపీ, కోర్టు సహాయకుడు ఉండవల్లి అరుణ్ కుమార్‌కి అందచేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని కర్త చెరుకూరి కిరణ్‌లను హైకోర్టు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 31వతేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలపై తెలంగాణ హైకోర్టు మండిపాటు

మూడు వారాల్లో కౌంటర్లు వేయాల్సిందే.. ఇదే చివరి అవకాశం

'సుప్రీం' ఆదేశాలతో హైకోర్టు విచారణ..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం సెక్షన్ 45 ఎస్‌కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించిన మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కేసులో అధీకృత అధికారి నాంపల్లి కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదును కొట్టేస్తూ 2018 డిసెంబర్ 31న ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేల్రప్రోలు రజనీ తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశాయి. అదే విధంగా హైకోర్టు తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రామోజీ, మార్గదర్శి వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశాయి. ఈ అప్పీళ్లన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. హైకోర్టు తీర్పును తప్పుబడుతూ దాన్ని రద్దు చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై తిరిగి విచారణ చేపట్టాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. డిపాజిట్ల సేకరణకు సంబంధించిన వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టం చేసింది. ఉండవల్లి, రిజర్వ్ బ్యాంక్, ఏపీ సర్కార్‌తో సహా అందరి వాదనలు వినాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. గతేడాది నవంబర్ 7న విచారణ సందర్భంగా మార్గదర్శి ఆర్థిక అవకతవకలపై పూర్తి వివరాలతో నాలుగు వారాల్లో కౌంటర్లు దాఖలు చేస్తామని ఇరు రాష్ట్ర ప్రభుత్వాల న్యాయవాదులు హైకోర్టుకు నివేదించిన విషయం తెలిసిందే. అయితే ఇరు ప్రభుత్వాలు కౌంటర్లు దాఖలు చేయలేదు. తాజాగా ఈ వ్యాజ్యాలపై జస్టిస్ సుజోయ్ పాల్ ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, కోర్టు సహాయకుడిగా మాజీ ఎంపీ అరుణ్‌కుమార్, ఆర్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణ్ రవిచందర్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది (ఎస్‌జీపీ) బి.రాజేశ్వర్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపించారు.



6వతేదీ కల్లా ఉండవల్లికి ఆ కాపీలు ఇవ్వండి

ఆర్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణన్ రవిచందర్ స్పందిస్తూ 200కిపైగా పేజీలతో మార్గదర్శి ఫైనాన్సియర్స్, చెరుకూరి కిరణ్ గత నెల 19న రిప్లై దాఖలు చేశారని, దీనిపై తాము పూర్తి వివరాలతో అదనపు కౌంటర్ దాఖలు చేస్తామని నివేదించారు. ఇందుకు మూడు వారాల గడువునివ్వాలని కోరారు. అయితే కోర్టు ఆదేశాలు జారీ చేసినా కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఇప్పటి వరకు కౌంటర్లు దాఖలు చేయలేదని ఆయన ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఈ సమయంలో ఉండవల్లి అరుణ్ కుమార్ స్పందిస్తూ.. కోర్టు ఆదేశించినప్పటికీ మార్గదర్శి ఫైనాన్షియర్స్ దాఖలు చేసిన రిప్లై కాపీని తనకు ఇవ్వలేదని ధర్మాసనానికి నివేదించారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ ఈ నెల 6వతేదీలోపు ఆ రిప్లై కాపీని ఉండవల్లి అరుణ్ కుమార్‌కి అందజేయాలని మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ని ఆదేశించింది.

కోర్టు ఆదేశాలను ఇలాగేనా అమలు చేసేది..?

విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు ధర్మాసనం ఇరు రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంకెన్నాళ్లకు కౌంటర్లు దాఖలు చేస్తారని నిలదీసింది. సుప్రీంకోర్టు పంపిన వ్యాజ్యాల్లోనూ ఇలా చేస్తే ఎలా? అంటూ మండిపడింది. కోర్టు ఆదేశాలను అమలు చేసేది ఇలాగేనా? అని నిలదీసింది. మూడు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ఇరు ప్రభుత్వాలను ఆదేశించింది. అదనపు కౌంటర్ దాఖలు చేసేందుకు రిజర్వ్ బ్యాంక్‌కి మూడు వారాల గడువునిచ్చేందుకు ఇరుపక్షాలు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. దీంతో ధర్మాసనం ఉత్తర్వుల జారీకి సిద్ధమైంది. ఈ సమయంలో మార్గదర్శి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అడ్డుకుని మాట్లాడటంపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. అనంతరం విచారణను ఈ నెల 31కి వాయిదా వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ల దాఖలు విషయంలో తమ ఆదేశాల అమలు నిమిత్తం ఉత్తర్వుల కాపీని అడ్వొకేట్ జనరల్ కార్యాలయానికి సోమవారంలోగా పంపాలని హైకోర్టు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

వేల కోట్లు కొల్లగొట్టిన మార్గదర్శి ఫైనాన్షియర్స్

రామోజీరావు 1972లో హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) కింద మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఏర్పాటు చేశారు. 1997లో కేంద్ర ప్రభుత్వం ఓ చట్టం తెచ్చింది. హెచ్‌యూఎఫ్ లాంటి అన్ ఇన్ కార్పొరేటెడ్ (చట్టపరంగా ఓ కంపెనీగా రిజిస్టర్ కాకుండా వ్యాపారం చేసేవి) సంస్థలు వ్యాపార కార్యాలయాల కోసం ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడాన్ని అది నిషేధించింది. అయినప్పటికీ రామోజీరావు నేతృత్వంలోని మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్‌బీఐ చట్ట నిబంధనలను ఉల్లంఘించి దాదాపు 2.75 లక్షల మంది డిపాజిటర్ల నుంచి 2006 మార్చి నాటికి దాదాపు రూ.2,610.38 కోట్లు వసూలు చేసింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా రామోజీరావు ప్రజల నుంచి చట్ట విరుద్ధంగా డిపాజిట్లు స్వీకరించడంపై అప్పటి కాంగ్రెస్ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ 2006 నవంబర్ 6న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేశారు. చట్ట విరుద్ధంగా మార్గదర్శి సేకరించిన డిపాజిట్ల వివరాలను ఆర్‌బీఐ అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని ఆర్‌బీఐ స్పష్టంగా చెప్పింది. డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం తమకు లేదని ఆర్‌బీఐ చేతులెత్తేయడంతో డిపాజిటర్ల ప్రయోజనాలను పరిరక్షించే నిమిత్తం మార్గదర్శి ఫైనాన్షియర్స్, రామోజీరావులపై అప్పటి ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది.

అక్రమాలను నిర్ధారించిన రంగాచారి

మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలు, అవకతవకలను నిగ్గు తేల్చి నివేదిక ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు (ఫైనాన్స్) ఎస్.రంగాచారిని నియమిస్తూ 2006 డిసెంబర్ 19న జీవో 800 జీవో జారీ అయింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై చట్ట ప్రకారం న్యాయస్థానాల్లో ఫిర్యాదు చేసేందుకు, తదనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ఐఏఎస్ అధికారి టి.కృష్ణరాజును అధీకృత అధికారిగా నియమిస్తూ అదే రోజు జీవో 800 వెలువడింది. దీంతో తమ అక్రమాలు బయటపడటం ఖాయమని పసిగట్టిన మార్గదర్శి, రామోజీరావులు.. రంగాచారి, కృష్ణరాజు నియామకాలను సవాలు చేస్తూ సుదీర్ఘ కాలం న్యాయస్థానాలను ఆశ్రయించారు. అయితే రామోజీరావుకు అటు హైకోర్టు, ఇటు సుప్రీంకోర్టులోనూ చుక్కెదురైంది. ఈ క్రమంలో తాము కోరిన వివరాలు మార్గదర్శి ఇవ్వకపోవడంతో రంగాచారి ఆదాయ పన్ను శాఖ నుంచి అవసరమైన డాక్యుమెంట్లను సేకరించి పరిశీలించారు. 2007 ఫిబ్రవరి 19న తన నివేదికను ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లు సేకరించడం నిజమేనని తేల్చారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, అది డిపాజిట్లను తిరిగి చెల్లించే స్థితిలో లేదని ఆయన అందులో స్పష్టంగా పేర్కొన్నారు. మార్గదర్శి ఫైనాన్షియర్స్ ద్వారా ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్లను రామోజీరావు తన అనుబంధ కంపెనీలకు మళ్లించడమే నష్టాలకు ప్రధాన కారణమని రంగాచారి తన విచారణ ద్వారా తేల్చారు.

అధీకృత అధికారి ఫిర్యాదు కొట్టేసిన హైకోర్టు

చట్ట ఉల్లంఘనలకు పాల్పడిన మార్గదర్శి ఫైనాన్షియర్స్, దాని హెచ్‌యూఎఫ్ కర్త రామోజీరావులను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి టి.కృష్ణరాజు 2008 జనవరి 23న నాంపల్లి మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు (సీసీ నెంబర్ 540) చేశారు. ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 45(ఎస్)కు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధమని, అయితే మార్గదర్శి ఫైనాన్షియర్స్ అందుకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించి నేరం చేసిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది ఆర్‌బీఐ చట్టం సెక్షన్ 58 ప్రకారం శిక్షార్హమని తెలిపారు. దీంతో రామోజీరావు ఈ ఫిర్యాదు విషయంలో మళ్లీ ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించారు. చివరకు హైకోర్టు 2018 డిసెంబర్ 31న రామోజీరావుపై అధీకృత అధికారి చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ తీర్పునిచ్చింది.

హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీంకోర్టు

ఈ తీర్పుపై అటు ఉండవల్లి అరుణ్ కుమార్, అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అలాగే హైకోర్టు తీర్పులో కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మార్గదర్శి, రామోజీ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. వీటన్నింటిపై సుప్రీంకోర్టు 2020 నుంచి విచారిస్తూ వచ్చింది. అటు తరువాత ఈ వ్యాజ్యాల్లో ఆర్బీఐని కూడా ప్రతివాదిగా చేర్చింది. విచారణ సందర్భంగా ఆర్‌బీఐ తరఫు న్యాయవాది కూడా మార్గదర్శి, రామోజీరావు చట్ట ఉల్లంఘనలకు పాల్పడ్డారని మౌఖికంగా కోర్టుకు తెలిపారు. చివరగా గతేడాది ఏప్రిల్ 9న సుప్రీంకోర్టు ఈ వ్యాజ్యాలన్నింటిపై విచారణ జరిపింది. చట్ట ఉల్లంఘనలకు పాల్పడినందుకు రామోజీరావు, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ప్రాసిక్యూట్ చేయాలని కోరుతూ అధీకృత అధికారి కృష్ణరాజు నాంపల్లి కోర్టులో దాఖలు చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఇదే సమయంలో డిపాజిట్లు తిరిగి ఇచ్చేశాం కాబట్టి తనపై కేసులు కొట్టేయాలంటూ రామోజీ, మార్గదర్శి ఫైనాన్షియర్స్ చేసిన అభ్యర్థలను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ చట్ట విరుద్ధంగా సేకరించిన డిపాజిట్లపై నిగ్గు తేలాల్సిందేనని తేల్చి చెప్పింది. కేసు లోతుల్లోకి వెళ్లి అందరి వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టుకు స్పష్టం చేసింది. ఈ ఆదేశాల మేరకు తెలంగాణ హైకోర్టు విచారణ నిర్వహిస్తోంది.

దుర్గమ్మ సేవలో ఎంపీ డీకే అరుణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన అరుణకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ డీఈవో రత్నరాజు ఎంపీ డీకే అరుణకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

సైన్స్ ప్రదర్శనకు 1,130 ప్రదర్శనలు : డీఈఓ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జడ్చర్లటౌన్: ఈనెల 7, 8, 9వ తేదీల్లో జడ్చర్ల మండలం ఎస్‌కేవీఎర పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సైన్స్ ప్రదర్శనకు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు మహబూబ్‌నగర్ డీఈఓ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు వివిధ కేటగిరిల్లో మొత్తం 1,130 ప్రదర్శనలు పాల్గొనున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్, రాజ్యస్థాయ బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శిని పేరుతో సర్ జగదీశ్ చంద్రబోస్ ప్రాంగణంలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 9న జరిగే ముగింపు కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లాఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ్మ, మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీలు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, సురభీవాణి, ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి హాజరుఅవుతారని పేర్కొన్నారు. విశిష్ట అతిథులుగా విద్యాశాఖ కార్యదర్శి శ్రీధర్, కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నర్సింహ్మారెడ్డి రానున్నట్లు తెలిపారు. ప్రదర్శనకు చైర్మన్‌గా కలెక్టర్ విజయేందిర బోయి వ్యవహరిస్తారన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సందేహాలు ఉంటే జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ సెల్ నంబర్: 8897155001నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు తమ విద్యార్థులను సైన్స్ ప్రదర్శనను తిలకించేందుకు తీసుకురావాలని కోరారు.

సంక్రాంతికి ఆర్టీసీ సన్నద్ధం





మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు

- రీజియన్ నుంచి 320 అదనపు బస్సులు.. తిరుగు ప్రయాణానికి 250 బస్సులు
- ఈ నెల 8 నుంచి నడవనున్న సర్వీసులు

స్టేషన్ మహబూబ్‌నగర్: వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వస్తుంటారు. ఉద్యోగులు, శ్రామికులు పండుగకు గ్రామానికి వచ్చి భోగి, సంక్రాంతి, కనుమ పండుగ సంబరాలను ఆస్వాదిస్తారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

10 డిపోల నుంచి..

ప్రయాణికుల సౌకర్యార్థం మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని 10 డిపోల నుంచి 320 అదనపు బస్సులను వివిధ ప్రాంతాలకు నడపనున్నారు. ఈ నెల 8 నుంచి 13 వరకు అదనపు సర్వీసులు నడుస్తాయి. ఆయా డిపోల నుంచి హైదరాబాద్‌కు ఎక్కువ సంఖ్యలో బస్సులు తిరగనున్నాయి. హైదరాబాద్ రూట్‌లోనే ఎక్కువ ఆదాయం వస్తుండటంతో ఎక్కువ అదనపు సర్వీసులు నడపనున్నారు. తిరిగి 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు తిరుగు ప్రయాణానికి కూడా 250 ప్రత్యేక బస్సులు నడవనున్నాయి.

పలు పాయింట్ల వద్ద బస్సులు

హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, ఆరాంఘర్, ఐఎస్ సదన్, గచ్చిబౌలి పాయింట్ల నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు అధికసంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆయా పాయింట్ల వద్ద ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా బస్‌షెల్టర్లు, తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. ఆయా పాయింట్ల వద్ద ఆర్టీసీ వాలంటీర్లు, అదనపు సెక్యూరిటీ సిబ్బంది సేవలు అందించనున్నారు.

డిపోల వారీగా అదనపు బస్సుల కేటాయింపు ఇలా..

డిపో	బస్సుల సంఖ్య
మహబూబ్‌నగర్	42
వనపర్తి	40
షాద్‌నగర్	40
గద్వాల	35
నారాయణపేట	33
నాగర్‌కర్నూల్	32
కల్వకుర్తి	32
అచ్చంపేట	32
కొల్లాపూర్	31
కోస్గి	3

ప్రయాణికుల సౌకర్యార్థం..



సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని డిపోల నుంచి అదనపు బస్సులు నడపనున్నాం. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. సురక్షితమైన ప్రయాణానికి ప్రజలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి.

– పి.సంతోష్‌కుమార్, ఆర్టీసీ ఆర్‌ఎం, మహబూబ్‌నగర్

నీటి మళ్లింపు నిర్ణయాన్ని మార్చుకోవాలి

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



నాగర్‌కర్నూల్: ఏదుల నుంచి డిండికి నీటి మళ్లించడానికి తీసుకున్న నిర్ణయాన్ని నిలుపుదల చేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఈమేరకు సీఎంకు లేఖరాసి అనంతరం పత్రికలకు విడుదల చేశారు. పాలమూరు–రంగారెడ్డి కింద ఏదుల గ్రామం వద్ద నిర్మించిన రిజర్వాయర్‌కు గండికొట్టి రోజుకు 0.5టీఎంసీ నీటిని డిండి రిజర్వాయర్‌కు మళ్లిస్తే 'పాలమూరు' ద్వారా లబ్ధిపొందాల్సిన 12 లక్షల ఎకరాలకు చెందిన రైతుల బతుకులు నాశనం అవుతాయని అన్నారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా డిండికి నీరు మళ్లించొద్దు అని మాజీ సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడును ఒప్పించి కేఎల్ఐ ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, భీమా 1, 2ప్రాజెక్టుకు 20టీఎంసీ నికర జలాలను కేటాయించారని, నెట్టెంపాడు ఇతర ప్రాజెక్టులను రూపకల్పన చేసినట్లు గుర్తు చేశారు. రేపు జరిగే క్యాబినెట్ సమావేశంలో పాలమూరు, రంగారెడ్డి జిల్లా ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంటే రెండు జిల్లాల ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఒకసారి ఏఎంఆర్ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ డీపీఆర్‌ను పరిశీలించాలని, ఏదుల రిజర్వాయర్‌కు గండి కొట్టడం ఆపాలని అన్నారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



సమస్యలు పరిష్కరించాలని మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న భూత్పూర్ గ్రామస్తులు

మక్తల్: సంగంబండ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నేరెడుగాం, భూత్పూర్ గ్రామస్తులను ఇందిరమ్మ రాజ్యంలో ఆదుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మక్తల్ మండలం భూత్పూర్, మాగనూర్ మండలం నేరెడుగాం గ్రామాల్లో పర్యటించి ఇళ్లను పరిశీలించారు. ఇళ్లల్లోకి విషపు పురుగులు వస్తున్నాయని, సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్తులు మంత్రికి వివరించారు. జీఓనంబర్ 120 వచ్చి సుమారు 15 ఏళ్లు దాటినా నేటికీ పునరావాస గ్రామం ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో పునరావాస గ్రామం ఏర్పాటు పనులు ప్రారంభిస్తామని మంత్రి వారికి భరోసానిచ్చారు. హైదరాబాద్‌లో ఉండే ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ కమిషనర్‌కు సమస్యను వివరించామని.. ప్రతి కుటుంబానికి 200 గజాల ప్లాటు ఇవ్వాలని సూచించామన్నారు. వెంటనే భూ సేకరణ చేపట్టి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం రోజుల్లో అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ముంపు గ్రామాల సమస్యలను కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు తెలియజేశామన్నారు. వెంటనే పరిష్కరించాలని మంత్రిని ప్రత్యేకంగా కోరారు. అనంతరం గ్రామస్తులు మంత్రిని సన్మానించారు. మంత్రి వెంట అదనపు కలెక్టర్ బెంచాలమ్, ఆర్డీఓ రాంచందర్‌నాయక్, ఎంపీడీఓ రమేశ్, డీఆర్డీఓ మొగులప్ప, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, మాజీ ఎంపీటీసీ కుర్మయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, చెన్నయ్యగౌడ్, భీసేన్‌రావు, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారి ఉత్సవాలకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి



మైసమ్మ దేవాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ

- పట్టువస్త్రాలు సమర్పించిన దేవాలయ కమిటీ చైర్మన్

నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజారులు కలశాభిషేకంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కాకర్లపహాడ్ గ్రామం నుంచి దేవాలయ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి పాదయాత్రతో పట్టువస్త్రాలు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించగా ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభించారు. భక్తులు పెద్దఎత్తున దేవాలయానికి చేరుకుని పూజలుచేశారు. దేవాలయాధికారి మధనేశ్వర్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు గోపాల్, కృష్ణయ్య, వేణాచారి, నరేందర్, మాజీ సర్పంచ్ నర్సింహులు, శ్రీనివాస్, నరేష్, గోపాల్, మల్లేష్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ ప్రత్యేకపూజలు

మైసమ్మ ఉత్సవాల్లో భాగంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. ఉత్సవాలకు సంబంధించి వచ్చే భక్తులకు ప్రత్యేక వైద్యసదుపాయాలు అందించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. వారం రోజుల పాటు అడవిలో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు.

రామన్‌పాడుకు 820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడులో శుక్రవారం నీటి మట్టం 1,020 అడుగుల మేర ఉంది. జూరాల ఎడమ కాల్వ నుంచి 820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వ ద్వారా 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వ ద్వారా 15 క్యూసెక్కులు వదులుతున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.